ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
గురువారం 4 డిసెంబరు 2025

రూ.కోట్లు కొట్టేశారు..!

- జగనన్న ఇళ్లలో భారీ అక్రమాలు
- ఖాళీ ప్లాట్లకు బీఎల్, ఆర్‌ఎల్ బిల్లుల చెల్లింపులు
- బేస్‌మట్టం నిర్మాణానికి రూఫ్ లెవెల్ బిల్లులు
- కాంట్రాక్టర్లతో సచివాలయ, హౌసింగ్ అధికారుల కుమ్మక్కు
- యాప్ సర్వేలో బహిర్గతమౌతున్న అక్రమాలు


రామేశ్వరం లేఅవుట్‌లో నాసిరకం నిర్మాణం

వైసీపీ ప్రభుత్వం జగనన్న ఇళ్లపేరిట పేదలకు సెంటు స్థలం ఇచ్చి ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లతో నిర్మించిన ఇళ్లలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. సచివాలయ ఇంజనీర్లతో పాటు హౌసింగ్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయి ఏకంగా ఖాళీ ప్లాట్లకు సైతం బేస్‌మట్టం, రూఫ్ లెవెల్ బిల్లులు చేసుకున్నారు. మరికొన్ని చోట్ల బేస్‌మట్టం నిర్మించి రూఫ్ లెవెల్ బిల్లులు తీసుకున్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు.. వేల సంఖ్యలో చేసుకున్న ఈ అక్రమ బిల్లుల విలువ రూ.కోట్లలో ఉంటుంది.

అరుణ్‌బాబు

ప్రొద్దుటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక జగనన్న కాలనీలలో నిర్మించిన ఇళ్లపై హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌తో సర్వే చేపట్టింది. దీంతో జిల్లాలో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్లలో పెద్దఎత్తున అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఇందులో ఆప్షన్-3 కింద జిల్లాలో మొత్తం 13,681 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిని ప్రత్యేక యాప్ ద్వారా ఏఈ, డీఈ, డీవీహెచ్, డీహెచ్ స్థాయిలలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని హౌసింగ్ ఎండీ ఆదేశించారు. ఆ మేరకు ఏఈ స్థాయిలో పరిశీలించి దాదాపు 6,298 ఇళ్లకు సంబంధించి తేడాలున్నాయని గుర్తించారు. వీటిలో ఎలాంటి నిర్మాణం చేపట్టకనే బీఎల్, ఆర్‌ఎల్ బిల్లులు అయినవి.. బీల్ నిర్మించి ఆర్‌ఎల్ బిల్లులు చేసినవి.. బేస్‌లెవెల్ రూఫ్‌లెవెల్‌లలో నిర్మించిన కట్టడాలు నాసిరకంగా ఉండి నెర్రలు చీలినవి ఉన్నాయని గుర్తించారు. ప్రొద్దుటూరులోనే ఈ అక్రమాలు అత్యధికంగా సాగాయి. ఆన్‌లైన్‌లో చేసిన బిల్లుల మేరకు తప్పు చేసిన వారితోనే ఆ కట్టడాలు నిర్మించాలని హౌసింగ్ ఎండీ ఆదేశించారు. కాగా.. 6,298 ఇళ్ల నిర్మాణాల్లో స్టేజీ తేడాలున్నాయని, వాటిని కాంట్రాక్టర్లతో చేయించలేదంటూ ఉమ్మడి జిల్లాలోని 51 మండలాల్లో 187 సచివాలయాల పరిధిలో మొత్తం 201 మంది సచివాలయ హౌసింగ్ సిబ్బందికి నవంబరు నెల జీతాలు నిలిపి వేస్తు హౌసింగ్ ఎండీ ఆదేశాలు జారీ చేశారు.

కాంట్రాక్టర్లు చేపట్టిన నిర్మాణాలు, బిల్లుల్లో తేడా

ప్రాంతం	నిర్మాణం	వ్యత్యాసం
ప్రొద్దుటూరు అర్బన్	5,883	3,650
ప్రొద్దుటూరు రూరల్	1,249	741
పులివెందుల	1,932	676
బద్వేలు అర్బన్	1,215	186
కడప అర్బన్	1,073	681
మైదుకూరు అర్బన్	1,179	141


బొల్లవరం లేఅవుట్‌లో నాసిరకం నిర్మాణంతో కూలిన గోడలు

యాప్ ద్వారా నిర్మాణాల్లో గుర్తించిన తేడాలు

ప్రొద్దుటూరులో హౌసింగ్ ఏఈలు రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాల్లో తేడాలను యాప్‌ద్వారా గుర్తించారు. బొల్లవరం లేఅవుట్‌లోని 7వ సచివాలయానికి చెందిన ఇరుబోతుల కుమారి ప్లాట్ నెంబరురు బి బ్లాక్- 323కు ఆర్‌ఎల్ బిల్లులు చేశారు. ఈ ఇంటిని కాంట్రాక్టర్ గుర్రం రవి నిర్మించారు. కానీ నాసిరకంగా నిర్మించడంతో గోడలు పడిపోయాయి. 24 సచివాలయానికి చెందిన భూమిరెడ్డి రామసుబ్బమ్మకు బొల్లవరం లేఅవుట్ ప్లాట్ నెంబరు డి బ్లాక్ 698లో కాంట్రాక్టర్ గుర్రం రవి పేర బీఎల్ స్టేజీకి బిల్లులు అయ్యాయి. ఏ బ్లాక్ 26 ప్లాట్‌లో 15వ సచివాలయ పరిధిలోని ఈదుల వెంకలక్షుమ్మకు కాంట్రాక్టర్ పందిటి రవిప్రకాశ్ పేర బీఎల్ స్టేజీకి బిల్లులు అయ్యాయి. ఎఫ్ బ్లాక్ 928 ప్లాట్‌లో 42వ సచివాలయానికి చెందిన షేక్ ఫకృబీ ఇంటికి శ్రీవెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ వారు ఆర్‌ఎల్ బిల్లులు చేసుకున్నారు. రామేశ్వరం లేఅవుట్‌లోని డీ బ్లాక్ ప్లాట్ 413లోని తాళ్లమాపురం లక్ష్మీనారాయణమ్మ ఇంటికి వాసవి ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేర బీఎల్ బిల్లులు, మీనాపురం లేఅవుట్‌లోని ప్లాట్ నెంబరు ఏ-1207 వినాయక కన్‌స్ట్రక్షన్‌కు బీఎల్ స్టేజీకి బిల్లులు చేసుకున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో ఇవన్నీ ఖాళీ జాగాలు. దీనిని బట్టి ఈ మూడు లేఅవుట్‌లలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నట్లు హౌసింగ్ అధికారుల సర్వేలో వెల్లడైంది. వీటిని ఏమేరకు సరిచేస్తారో వేచి చూడాల్సి ఉంది.

తేడాలు సరిచేయకుంటే క్రిమినల్ కేసులు

జిల్లాలో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లు చేపట్టిన ఇంటి నిర్మాణాలలో తేడాలను ప్రత్యేక యాప్ ద్వారా గుర్తించాం. వీటిలో బేస్‌మట్టం నిర్మించకనే బిల్లులు చేసుకుని ఉంటే.. బేస్‌మట్టం నిర్మించాలి. లేదంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు ఆస్తులు అటాచ్ చేయమని ప్రభుత్వం ఆదేశించింది. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ ఏఈలకు డిసెంబరు నెలాఖరు వరకు గడువు ఇచ్చాం. గుర్తించిన తేడాలన్నింటినీ కాంట్రాక్టర్లతో సరిచేయకుంటే అందరిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.

- రాజారత్నం, ప్రాజెక్టు డైరెక్టర్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్, కడప జిల్లా

నగరంలో జోరు వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం


కడప నగరంలో జోరుగా కురుస్తున్న వర్షం

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో బుధవారం ఉదయం నుంచి మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా వర్షం జోరందుకుంది. సుమారు గంటపాటు కురిసిన ఈ వానకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వైజంక్షన్, చిన్నచౌక్, కొత్తబస్టాండ్, గంజికుంట కాలనీ, బిల్టప్ హోమియో పతికళాశాల రోడ్‌తో పాటు పలలు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచి పోయింది. దీనితో పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల కాల్వలు పొంగి రోడ్లపైకి వర్షపునీరు వచ్చేసింది. ట్రాఫిక్ కూడా కొన్ని గంటపాటు స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ సిస్టమ్ లోపాల కారణంగా ఇళ్ల ముందు వరకు నీరు చేరడం నగర పాలక శాఖ నిర్లక్ష్యాన్ని బయటపెట్టింది.

6న జడ్పీ సర్వసభ్య సమావేశం

కడప రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని 6వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. ఉదయం 10 గంటలకు జడ్పీ సమావేశ హాలులో ప్రారంభమవుతుందన్నారు. గౌరవ సభ్యులు ఈ విషయాన్ని గమనించి గుర్తింపు కార్డుతో హాజరు కావాలన్నారు. సంబంధిత శాఖల జిల్లా ఆధికారులందరు ఆయా శాఖల పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఆధిక కేసులు రాజీ అయ్యేలా ఆయా కోర్టుల న్యాయమూర్తులు కృషిచేయాలని డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. బుధవారం వర్చువల్ విధానంలో ఆయా కోర్టుల జడ్జిలతో ముందస్తు లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా లోక్‌అదాలత్‌లను దేశమంతటా నిర్వహిస్తూ వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన లోక్‌అదాలత్ ప్రయోజనాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పోక్సో కోర్టులో సంచలన తీర్పు

- లైంగిక దాడి కేసులో ముద్దాయికి జీవిత ఖైదు
- బాధితురాలికి రూ.10.50లక్షల పరిహారం చెల్లింపునకు ఆదేశం


ముద్దాయి గాలి రాంప్రసాద్‌రెడ్డి

కడప క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైలులో ఆరేళ్ల క్రితం ఓ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో కడప పోక్సో కోర్టు జడ్జి సి.ప్రవీణ్‌కుమార్ సంచలన తీర్పు ఇచ్చారు. ముద్దాయికి జీవితఖైదు, రూ.10వేలు జరిమానాతో పాటు బాలికకు రూ.10.50లక్షలు ఇవ్వాలని రైల్వే అధికారులను ఆదేశించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 2019 జనవరి 27న తిరుపతి-నిజామాబాద్ సూపర్ ఫాస్ట్ రైలులో 8 సంవత్సరాల బాలిక తల్లి దండ్రులతో కలిసి ప్రయాణించింది. ఆ రోజు రాత్రి రైలులో టాయిలెట్‌కు వెళ్లిన బాలికను కడపకు చెందిన గాలి రాంప్రసాద్‌రెడ్డి ఆలియాస్ ప్రసాద్ వెంబడించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆ బాలిక కేకలు వేయడంతో ప్రయాణికులు, తల్లిదండ్రులు నిందితుడిని పట్టుకుని రైల్వే టీటీఐకి అప్పగించారు. అయితే రైలు కడపకు చేరుకునేసరికి నిందితుడు రైలు నుంచి దూకి తప్పించుకున్నాడు. కాగా బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు సికింద్రాబాద్ రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి కడపకు బదిలీ చేశారు. రైల్వే డీఎస్పీ రమేశ్ ఆ కేసును దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేసి 2019 ఫిబ్రవరి 5న రాంప్రసాద్‌రెడ్డిని అరెస్టు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కడప పోక్సో కోర్టు ముద్దాయికి జీవిత ఖైదుతో పాటు రూ.10వేలు జరిమానా విధించింది. అలాగే గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజరుకు రూ.10.50లక్షలు బాధితురాలికి పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కొమ్మినేని వేణుగోపాల్, సానేపల్లి రామసుబ్బారెడ్డి వాదించారు.

ఘనంగా ముగిసిన తిరునాళ్లు


తిరునాళ్లకు భారీగా తరలివచ్చిన భక్తులు

కలసపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని పరిపేతురు-పరిపౌలు ఆలయ 138వ వార్షికోత్సవ తిరునాళ్ల బుధవారం ఘనంగా ముగిసింది. మంగళవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికను భక్తుల కోసం ప్రదర్శించారు. కలసపాడు గ్రామానికే చెందిన నంద్యాల డయాసిస్ బిషప్ సంతోశ్ ప్రసన్నకుమార్ ఇచ్చిన దైవ సందేశం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం పలువురు భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుణాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ హేమసుందర్‌రావు, ఎస్‌ఐలు తిమోతి, యోగేంద్రలు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

రేపు మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

- పాల్గొనే వారందరికి మధ్యాహ్న భోజనం


గత ఏడాది కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో భోజనం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి (ఫైల్)

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 5వ తేదీ శుక్రవారం నిర్వహించనున్న మూడో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (ఎంపీటీఎం-3.0) కోసం పాఠశాలలన్నీ సిద్ధమవుతున్నాయి. ఈ సందర్భంగా పాల్గొనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, దాతలు, ప్రజాప్రతినిధులు, అల్యూమినీ, విద్యార్థులందరికి మధ్యాహ్న భోజనం వడ్డించాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ భారీ కార్యక్రమం కోసం పాఠశాలల్లో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు.

వంటపై సమగ్ర సూచనలు

శుక్రవారం మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ప్రభుత్వం సూచించింది. అందరికి పీనట్-జాగరీ చిక్కి తప్పనిసరిగా ఇవ్వాలి. పాఠశాల ఆవరణలో తాగునీరు సమృద్ధిగా ఉండేలా చూడాలని హెడ్‌మాస్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎన్‌జీఓలు అందించే భోజనం వేడి తగ్గకుండా పాఠశాలకు చేరాల్సి ఉంటుంది. ఈ మీటింగ్‌లో పాల్గొనే వారి అంచనా సంఖ్యను కుకింగ్ ఏజెన్సీలకు హెడ్ మాస్టర్లు ముందుగానే తెలియజేయాలి. ఫోర్టిఫైడ్, ఫైన్‌రైస్ కొరత ఉంటే వెంటనే డీఈఓ ద్వారా సివిల్ సప్లై శాఖను సంప్రదించాలని సూచించారు. రాగి, బెల్లం, గుడ్లు, పీనట్ -జాగరీ చిక్కి, ఇతర దినుసులు ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మీ టింగ్ రోజున పాల్గొన్న వారి సంఖ్య, వడ్డించి న భోజనాల వివరాలు లీప్ యాప్‌లోని పీటీఎం మాడ్యుల్ ద్వారా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

రేపు 1967 పాఠశాలల్లో ...

కడప కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 5న జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్ మీట్ నిర్వహిస్తోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణపై డీఈవో షంషుద్దీన్‌తో కలసి బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని 1967 పాఠశాలల్లో ఒకేరోజున 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. అన్ని చోట్ల ఒకే విధమైన ఏర్పాట్లు, అజెండాతో జరుగుతోందన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు అవుతారన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల మానసిక, సామాజిక స్థితి, ప్రవర్తన, అభ్యసన సామర్థ్యం గురించి సంబంధిత క్లాస్ లేదా హెడ్ మాస్టార్‌తో పేరెంట్స్ చర్చిస్తారన్నారు. అదే రోజున పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ మెగా పేరెంట్స్ మీట్‌కు తల్లిదండ్రులు ఇద్దరూ హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఏ పీవో ప్రేమంత్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలంటేే ఇంత నిర్లక్ష్యమా..?

- రెవెన్యూ అధికారులపై కలెక్టర్ సీరియస్


ప్రజల సమస్యలను అధికారుల సమక్షంలో పరిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీర్ఘకాలి కంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్య లపై ఇంత నిర్లక్ష్య మా అంటూ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులపై సీరియస్ అయ్యా రు. ఏళ్ల తరబడి పదేపదే అర్జీలు పెడుతున్నప్పటికీ ఎందుకు పరిష్కరిం చడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి జిల్లావ్యాప్తంగా అందిన ఫిర్యాదులు, 2022 నుంచి ఉన్న రెవె న్యూ సమస్యలపై పదేపదే వస్తున్న ఫిర్యాదులు, రెవెన్యూలో అవినీతికి పాల్పడుతున్న వారిపై వచ్చిన ఫిర్యాదులపై ఆర్డీవోలు, తహశీల్దార్లతో కలసి బుధవారం కలెక్టర్ ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. రెండుకంటే ఎక్కువసార్లు ఫిర్యాదు చేసిన వారి సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ప్రతి అర్జీదారునితో మాట్లాడారు. రెవెన్యూకు సంబంధించి గ్రామస్థాయి రికా ర్డులతో సరిచూసుకుంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు ఉండాలన్నారు. దీర్ఘకాలిక భూ సమస్యలు, కుటుంబ భాగ పరిష్కారాలు తీసుకోవాల్సిన చర్యలపై అర్జీదారులకు సూచనలు చేశారు. సంబంధం లేని వ్యక్తులు బద్వేలు డివిజన్ నుంచి పదే పదే ఫిర్యాదు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. అదే డివిజన్‌లో కొందరు ఉద్యోగుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకపోతే చర్యలు తీవ్రంగా ఉంటా యని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, జడ్పీ సీఈవో ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందని మిషన్...
ఆగిన కుట్టు
- పూర్తయిన శిక్షణ
- ఉచిత కుట్టుమిషన్ల కోసం మహిళలు
- వేతనాల కోసం ట్రైనర్లు
- నెలల తరబడి ఎదురు చూపులు

7

నేటి నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు

సోలార్ షాక్..!

- సూర్యఘర్ ద్వారా బ్యాంకు రుణం
- డబ్బు జమయినా సోలార్ ఏర్పాటు చేయని సంస్థ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు




వినియోగదారులు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావడం లేదని ప్రభుత్వం గగ్గోలు పెడుతోంది. ముందుకు వచ్చిన వారికి పరికరాలు ఇవ్వకుండా కంపెనీలు ఇబ్బంది పెడుతున్నాయి. బ్యాంకు రుణం మంజూరై నెలలు గడుస్తున్నా వినియోగదారులకు సోలార్ విద్యుత్ అందడం లేదు. రుణం తీసుకున్న వినియోగదారులు మాత్రం రెండు నెలల ఈఎంఐలు చెల్లించారు. దీంతో ప్రధానమంత్రి సూర్యఘర్ (సోలార్) ఏర్పాటు చేసుకోకనే వినియోగదారులకు షాక్ కొడుతోంది.

పులివెందుల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ముందుకు తెచ్చింది. ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం ప్రభుత్వం వినియోగదారులకు దాదాపు రూ.80వేలు సబ్సిడీ ఇస్తోంది. దాదాపు రెండేళ్లుగా ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రజలు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయినా సోలార్ విద్యుత్ ఏర్పాటు అనుకున్నంత వేగవంతంగా సాగడం లేదు. సాక్షాత్తు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ఇటీవల జరిగిన పులివెందుల అధికారుల సమీక్ష సమావేశంలో సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం అయ్యారంటూ ట్రాన్స్‌కో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

డబ్బు అందినా స్పందించని వైవాష్

వినియోగదారులు ముందుకు వస్తుంటే సోలార్ విద్యుత్ పరికరాలు అమర్చే సంస్థలు మాత్రం కుచ్చుటోపి పెడుతున్నాయి. వై వాష్ అనే సంస్థ జిల్లాలో దాదాపు 50 మందిని మోసం చేసినట్లు తెలిసింది. వినియోగదారులు సోలార్ విద్యుత్ కావాలని వైవాష్ సంస్థను సంప్రదించారు. బ్యాంకు రుణం అందితే మీ ఇంటిపై సోలార్ విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేస్తామని వారు చెప్పారు. దీంతో వినియోగదారులు సూర్యఘర్ పథకం ద్వారా బ్యాంకుల నుంచి రుణం పొందారు. ఆ రుణం నేరుగా వైవాష్ సంస్థకు చేరింది. డబ్బు చేరి రెండు నెలలైనా సోలార్ విద్యుత్ పరికరాలు అమర్చలేదు. ఒకపక్క ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్రతి ఇంటికి అందాలనే లక్ష్యంతో పథకాన్ని రూపొందించింది. మరోపక్క ఇలాంటి సంస్థల కారణంగా సోలార్ విద్యుత్ అంటేనే వినియోగదారులు వద్దనే పరిస్థితి వచ్చింది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రెండు నెలలైనా సోలార్ అందలేదు



మా ఇంటికి సోలార్ విద్యుత్ అందించేందుకు వై వాష్ అనే సంస్థ ప్రతినిధులను కలిశాను. వారు బ్యాంకు రుణం అందిన వెంటనే సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేస్తామన్నారు. రెండు నెలల క్రితమే నా పేరుతో బ్యాంకు రుణం మంజూరు చేసింది. ఆ మొత్తం ఆ సంస్థ ఖాతాకు జమ అయింది. ఈ రుణానికి సంబంధించి రెండు నెలల ఈఎంఐ కూడా చెల్లించాను. అయినా ఆ సంస్థ సోలార్ విద్యుత్ ఏర్పాటుచేయలేదు.

- ఆనంద్‌రెడ్డి, వేంపల్లె

పది రోజుల్లో ఏర్పాటుచేస్తాం

నలుగురు వినియోగదారుల నుంచి బ్యాంకు రుణం మా సంస్థకు అందింది. వారికి సోలార్ విద్యుత్ అందించాల్సి ఉంది. ఇప్పటికే 180 దరఖాస్తులు వచ్చాయి. సొంత నిధులు ఖర్చు చేసి అయినా పది రోజుల్లో ఈ నలుగురికి సోలార్ విద్యుత్ అందిస్తాం.

- హరి, వైవాష్ సంస్థ ప్రతినిధి

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం

సోలార్ ప్యానల్ బిగించుకున్నాక ట్రాన్స్‌కో ద్వారా ఒక మీటర్ ఏర్పాటుచేసిన అనంతరం వినియోగదారులకు సబ్సిడీ అందుతుంది. అంతేతప్ప వెండర్స్‌కు ట్రాన్స్‌కో అధికారులకు ఎటువంటి సంబంధం ఉండదు. వెండర్స్ మోసం చేశారని వినియోగదారులు ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం.

- ప్రసాద్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ, పులివెందుల



అందని మిషన్... ఆగిన కుట్టు

● పూర్తయిన శిక్షణ ● ఉచిత కుట్టుమిషన్ల కోసం మహిళలు
● వేతనాల కోసం ట్రైనర్లు ● నెలల తరబడి ఎదురు చూపులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళల ఆర్థిక స్వావలంభన చర్యలు తీసుకోవడంలో భాగంగా కుట్టుశిక్షణతో వారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో మహిళ దినోత్సవం రోజున కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ కుట్టుశిక్షణ కేంద్రాలకు తగినన్ని నిధులు లేకపోవడంతో అవి బాలారిష్టాలను నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో శిక్షణ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలుస్తుంది. మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చి డిమాండ్‌లో ఉన్న వివిధ రకాల దుస్తుల తయరీలో మెళకువలు నేర్పించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 24 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా శిక్షణ పొందేందుకు వివిధ ప్రాంతాల్లోని అర్హులైన 15594 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తొలి విడతగా 3068 మందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఎక్కడ కూడా అక్రమాలు చోటు చేసుకోకుండా శిక్షణ కార్యక్రమాలను పారదర్శకంగా సాగే విధంగా చర్యలు తీసుకున్నారు. శిక్షణకు హాజరైన వారందరికీ డిజిటల్ అటెండెన్స్ ద్వారా హాజరు నమోదు చేయడం జరిగింది.90 రోజుల పాటు ఇచ్చే కుట్టుశిక్షణకు 75శాతం హాజరైన వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలోజిల్లాలోని అన్నిశిక్షణ కేంద్రాల్లో 90 రోజులపాటు శిక్షణ కొనసాగింది. ఇందులో 70 రోజుల పాటు ఆసక్తిగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఒకరికి కూడా కుట్టుమిషన్ అందించిన పరిస్థితి లేదు. అంతేకాకుండా కుట్టుశిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు కూడా ఇవ్వకపోవడంతో వేలాది మంది మహిళలు కుట్టుమిషన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి.

ఆగిన కుట్టుశిక్షణ

ప్రభుత్వం కుట్టుశిక్షణతో పాటు ఉచితంగా కుట్టుమిషన్లు ఇస్తామనడంతో జిల్లాలో వేలాది



శిక్షణ తీసుకుంటున్న మహిళలు (ఫైల్)

మంది కుట్టుశిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపారు. ఒకసారి శిక్షణ తీసుకుంటే కుట్టుమిషను ద్వారా స్వయం ఉపాధి పొంది కుటుంబానికి ఆర్థికంగా ఆదరువుగా నిలవాలనేది వారి ఉద్దేశ్యం. అంతేకాకుండా ఇంట్లో పనిచేసుకుంటూ కుట్టుమిషన్ల ద్వారా మరింత మెరుగైన జీవనోపాధులను పొందవచ్చని ఆశించారు. ఈ కారణంగానే కుట్టుశిక్షణ పొందడం కోసం జిల్లాలో 15594 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటి వరకు 3068 మందికి మాత్రమే శిక్షణ ఇచ్చారు. మిగిలిన వారికి మరోవిడతలో శిక్షణ ఇచ్చే విధంగా జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. కానీ తొలివిడ తలో శిక్షణ పొందిన వారికే ఉచిత కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు ఇప్పటి వరకు ఇవ్వకపో వడం గమనార్హం.

కుట్టు శిక్షణ కేంద్రాల మూసివేత

ప్రస్తుతానికి కుట్టుశిక్షణ కేంద్రాలను మూసివేసినట్లు తెలుస్తోంది. కేవలం శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేయడం, శిక్షణ నిర్వహణను పర్యవేక్షించడం వరకే అధికార యంత్రాంగం బాధ్యతగా తెలుస్తోంది. శిక్షణ కేంద్రాల ఏర్పాటు, ట్రైనర్ల ఎంపిక, వేతనాల చెల్లింపు, ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ బాధ్యతలను ప్రభుత్వం ఒక ప్రైవేటు కాంట్రా క్టర్‌కు అప్పగించింది. మొదటి విడతకు సంబంధించిన బిల్లులు పెండింగులో ఉన్నాయంటూ శిక్షణ కార్యక్రమాలను ఆపివేశారు. దీంతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు కుట్టుమిషన్ల కోసం, శిక్షణ ఇచ్చిన ట్రైనర్లు వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈ విషయమై బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.జయసింహను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా... మొదటి విడత శిక్షణ అయిపోయిందన్నారు. ఆ తరువాత ప్రభుత్వం నుంచి తగిన ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రభుత్వ నిర్ణయం మేరకు మిగిలిన వారికి కుట్టుశిక్షణ ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు.

జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీలు



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న క్వాలిటీసెల్ అధికారి

జమ్మలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం అన్నమయ్య జిల్లా క్వాలిటీ సెల్ అధికారిణి నాగరాణి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అన్ని విభాగాలు పరిశీలించి శుభ్రతకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. రక్త పరీక్షల కేంద్రంలో అక్కడ సిబ్బందితో, రోగులతో ఆమె మాట్లాడారు. శానిటేషన్, శుభ్రతపై బయోమెడికల్ వేస్టమేనేజ్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ తదితర విషయాల్లో చర్చించారు. శుభ్రతగా ఉండాలని సూచించారు. అయితే జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది ఆస్పత్రిని శుభ్రంగా పెట్టడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ రఫీక్‌పాషా, ల్యాబ్ టెక్నీషియన్ రామచంద్ర, అక్కడున్న సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫ్రుద్దీన్ పేర్కొన్నారు. కడప నగరం శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో బుధవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి విభిన్న ప్రతిభావంతుల గౌరవం, హక్కులు, వారికి అందుతున్న సదుపాయాలు, సహాయ సహకారాలను తెలియపరిచారు. మేధో వైకల్యాలు ఉన్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం 2024, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 తదితర అంశాలను తెలియపరిచారు. అనంతరం ఆటపోటీలలో గెలుపొందిన పిల్లలకు సర్టిఫికెట్లను అందజేశారు.

మోరగుడి పీహెచ్‌సీలో గొడవ

● స్వీపర్ ఆత్మహత్యాయత్నం ● ఆస్పత్రికి తాళం వేసిన సిబ్బంది





చికిత్స పొందుతున్న స్వీపర్ సుజాత, పీహెచ్‌సీకి తాళం వేసిన దృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గొడవ జరిగింది. ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ తస్మియా, సిబ్బంది విధుల విషయంలో తనపై వేధింపులకు పాల్పడుతున్నారంటూ స్వీపర్ సుజాత పెట్రోలు వంటిపై పోసుకుని ఆత్మహత్యాప్రయత్నం చేసింది. దీంతో వెంటనే డాక్టర్, అక్కడున్న సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం వేశారు. అప్పటికే అక్కడున్న బాధితురాలి బంధువులు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతోంది. వివరాలిలా... మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వీపర్ సుజాతకు డాక్టర్ తస్మియా, సిబ్బంది మధ్య విధులకు సంబంధించి వివాదం జరుగుతోంది. స్వీపర్ తనకు సెలవులు అడిగినా డాక్టర్ మంజూరు చేయడం లేదని.. పనికి సంబంధించి సిబ్బంది వేధింపులకు గురిచేస్తుండ డంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు బాధితురాలి బంధువులు తెలిపారు. కాగా, ఆస్పత్రి డాక్టర్ తస్మియా, సిబ్బంది తాము స్వీపర్‌తో మాట్లాడుతుండగా ఆమె బంధువులు తమపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి అర్బన్ సీఐ నరేష్‌బాబు విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలో గోటూరు పాత టోల్‌గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు కర్నూలుకు చెందిన వెంకటేశులు, లక్ష్మీదేవి ద్విచక్రవాహనంలో కడప నుంచి కమలాపురం వైపు వస్తున్నారు. అదే సమయంలో వల్లూరు నుంచి కడప వైపు వెళుతున్న ఆటో వీరిని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయలైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కానీ ప్రమాదంలో గాయడపడ వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించినట్లు సమాచారం. అలాగే మరో ప్రమాదంలో గోటూరు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద క్రేన్ ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కొప్పోలికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కూలీలతో వెళుతున్న ఆటోను ఢీకొన్న కారు

● 8 మందికి తీవ్ర గాయాలు





కారు ఢీకొనడంతో బోల్తా పడ్డ ఆటో, క్షతగాత్రులను స్వయంగా తరలిస్తున్న సీఐ, కమిషనర్

మైదుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు సమీపంలోని అరోమా హోటల్ ఎదురుగా కడప-కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది గాయపడ్డారు. కడప వైపు నుంచి స్థానిక సరస్వతిపేటకు చెందిన కూలీలతో వస్తున్న ఆటోను వెనకవైపు నుంచి కారుడీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న సీఐ రమణారెడ్డి, కమిషనర్ రంగస్వామిలు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో మైదుకూరు ఆసుపత్రికి తరలించడంలో సహాయపడ్డారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప, ప్రొద్దుటూరుకు తరలించినట్లు వైద్యులు డాక్టర్ కరీముల్లా తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నాన్ బెయిలబుల్ వారెంటు ఉన్న వ్యక్తి అరెస్టు

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన గంధం నాగరాజు ఆలియాస్ చిలక అనే వ్యక్తిపై నాన్ బెయిలబుల్ వారెంటు ఉండటంతో బుధవారం అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. చెన్నూరు కొత్త రోడ్డు సరస్వతీ నగర్‌కు చెందిన నాగరాజు 2001లో జరిగిన ఓ హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఇతనిపై నాన్‌బెయిలబుల్ వారంటు ఉన్నా తప్పించుకుని తిరగడంతో బుధవారం అతనిపై నిఘా పెట్టి ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

లావనూరులో కొండచిలువ కలకలం

కొండాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు ఎస్సీ కాలనీలో బుధవారం కొండచిలువ కలకలం రేపింది. స్థానికంగా ఆదినారాయణ అనే వ్యక్తి ఇంటి సమీపంలో స్థానికులు కొండచిలువను గమనించారు. వెంటనే పాములు పట్టే వ్యక్తిని పిలిపించి పట్టుకున్నారు. అనంతరం కొండచిలువను ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. వారం రోజుల కిందట పాత కొండాపురం గ్రామంలో కొండచిలువ కోడిని పట్టుకొని చంపుతుండగా స్థానికులు గమనించి చంపేశారు.

నేటి నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు



జ్యోతి క్షేత్రంలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



అన్నదానం (వంటకు)కు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

కాశినాయన, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరికుంట్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని జ్యోతి క్షేత్రంలో గురువారం నుంచి కాశినాయన 30వ ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రెండురోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్నదానం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు భక్తులను ఆకట్టుకునేలా ఉన్నాయి.

35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

ఈ ఆరాధనోత్సవాలకు మైదుకూరు డిపోకు చెందిన 25 బస్సులు, గిద్దలూరు డిపో నుంచి 10 బస్సులు నడపనున్నట్లు మైదుకూరు డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయమ్మ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గురు, శుక్రవారాల్లో మైదుకూరు, పోరుమామిళ్ల, గిద్దలూరు నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు. కాగా, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 150 మందితో పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోరుమామిళ్ల సీఐ హేమసుందర్‌రావు, ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఇందులో 6 మంది ఎస్ఐలు, ముగ్గురు సీఐలు, 119 మంది పోలీసులు, 8 మంది మహిళా పోలీసులు, 14 మంది స్పెషల్ పార్టీ పోలీసులు ఉంటారన్నారు. ఇక మండల వైద్యాధికారులు డాక్టర్, ప్రశాంతి, డాక్టర్ పుష్ప ఆధ్వర్యంలో 5 మంది వైద్య ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక వైద్యశిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య విస్తరణా ధికారి బాలయ్య తెలిపారు.

6 నుంచి బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు

కడప కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీబ్రౌన్ 142వ వర్థంతి (డిసెంబరు 12)ని పురస్కరించుకుని స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. అందులో భాగంగా 6వ తేదీ ఉదయం 9 గంటలకు 6, 7, 8, తరగుతుల విద్యార్థులకు పద్యపఠనం (వేమన, సుమతి శతకాలలోని 6పద్యాలు.. ప్రతీ శతకం నుంచి మూడు పద్యాలు ఉండాలన్నారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు 9, 10 తరగుతుల విద్యార్థులకు బ్రౌన్ జీవితం-సాహిత్యం అనే అంశంపై వక్తృత్వం పోటీలు, 8వ తేదీ 3, 4, 5, తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, 9వ తేదీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ధారణ పరీక్ష (అంశం రామాయణ, భారత, భాగవతాలలోని విషయాలు)ఉంటుందన్నారు. 10వ తేదీ 8, 9, 10 తరగతుల వారికి కథాపురాణం, 11వ తేదీ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ (కడప జిల్లాకు చెందిన వైజ్ఞానిక అంశాలపై) పోటీలు ఉంటాయన్నారు. 12వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరిగే ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు.

62 స్కూల్‌వ్యాన్లు తనిఖీ

సీకేదిన్నె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీల్లో భాగంగా జిల్లాలో 62 పాఠశాల బస్సులను తనిఖీ చేసినట్లు ఇన్‌చార్జి డీటీసీ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల బస్సు ప్రమాదం జరిగిన నేపథ్యంలో ప్రత్యేకంగా చేపట్టిన స్కూలు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా కడప డివిజన్‌లో 22 బస్సులను తనిఖీ చేయగా 10 కండీషన్‌లో ఉన్నాయని, బద్వేలు డివిజన్‌లో ఆరు చెక్ చేయగా అయిదు బస్సులు మంచి కండీషన్‌లో ఉన్నాయన్నారు. పులివెందులలో ఆరు బస్సులకు గాను నాలుగు, ప్రొద్దుటూరులో 28 బస్సులుకు 19 కండీషన్‌లో ఉన్నాయన్నారు. మొత్తం 62 పాఠశాల వాహనాలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేయగా 38 కండీషన్‌లో ఉండగా, కండీషన్‌లో లేని 24 బస్సుల యజమానులకు నోటీసులు అందించినట్లు తెలిపారు. పాఠశాల వాహనాల యజమానులు బస్సులను ఎప్పటికప్పుడు కండీషన్‌లో ఉంచుకోవాలని, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

సిగటోక ఆకుమచ్చ తెగులుపై శిక్షణ

సింహాద్రిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురిజాల, బలపనూరు గ్రామాల్లో బుధవారం అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి పరిశోధన శాస్త్రవేత్త శిరీష మాట్లాడుతూ డిసెంబరులో చలి తీవ్రత, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో సిగటోక తెగులు వ్యాప్తి అయ్యే అవకాశం ఉందన్నారు. తెగులు ప్రారంభ దశలో మంకోజెబ్ లేదా క్లోరోతలోనిల్ ఒక లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. 15 రోజుల తర్వాత ప్రొపైకొనాజోల్ ఒక లీటర్ నీటికి ఒక మిల్లీ లీటర్ పిచికారి చేసుకోవాలన్నారు. గెల వేసిన తర్వాత ఆజాక్సి స్ట్రోబిన్+డైఫెనాకానాజోల్ ఒక లీటర్ నీటికి ఒక మిల్లీ లీటర్ పిచికారీ చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్, సూక్ష్మనీటి శాఖ పీడీ వెంకటేశ్వరరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తులు

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షసంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేందకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి డి.గంగిరెడ్డి తెలిపారు. ఈనెల 5లోగా దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అం దించాలని కోరారు. స్కూలు అసిస్టెంటు ఫిజికల్ సైన్స్ పోస్టు ఖాళీగా ఉందని.. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు రామనపల్లె హైస్కూలు విద్యార్థులు



చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ నపల్లెకు చెందిన నాగచైతన్య అనే విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కర్నూలు జిల్లా ఎమ్మి గనూరులో నవంబరు 29, 30 తేదీల్లో స్కూలు గేమ్ ఫెడరే షన్ అండర్19 రాష్ట్రస్థాయి పోటీల్లో 13 జిల్లాలకు చెందిన బాలబాలికలు కత్తిసాము పోటీల్లో పాల్గొన్నారు. అందులో ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి రామనపల్లె హస్కూ లు విద్యార్థి నాగచైతన్య ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థి 2026 జనవరి రెండో వారంలో పంజాబ్ రాష్ట్రం లూధియానలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అలాగే గత నెల 20, 30 తేదీల్లో విజయవాడ గన్నవరంలో జరిగిన స్కూలు గేమ ఫెడరేషన్ అండర్ 14 రగ్బీ రాష్ట్రస్థాయి పోటీల్లో రామనపల్లె హైస్కూలు విద్యార్థి కమాల్‌బాషా మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. వీరిద్దరిని ఆ పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, ఫిజికల్ డైరెక్టరు గణేశ్‌బాబులు అభినందించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు బయనపల్లె విద్యార్థినులు



సీకేదిన్నె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు బయనపల్లె వెంకటేశ్వర ఉన్నత పాఠశాల విద్యార్థిని తుమ్మల కావ్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దేవదయాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్‌కుమార్‌లు తెలిపారు. విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరచి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. అదే విధంగా అండర్-17 ఖోఖో బాలికల విభాగంలో విజయనగరంలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఉప్పు చైత్ర, కె.సుహాసిని మంచి ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్విజ్‌కు చిలమకూరు విద్యార్థినులు



ఎర్రగుంట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిలమకూరు జడ్పీహైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పి.సింధుప్రియ రాష్ట్రస్థాయి కౌశల్‌సైన్స్ క్విజ్‌పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పద్మనాభం తెలిపారు. అలాగే డి.దీపిక కౌశల్‌రీల్స్‌కి ఎంపికైందన్నారు. తిరుపతిలో డిసెంబరు 27న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో పాల్గొంటారన్నా రు. విద్యార్థుల ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

గండిదేవస్థానంలో ఘనంగా హనుమత్‌వ్రతం



హనుమత్‌వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

చక్రాయపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హనుమత్‌వ్రతం ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తిరుమల రామానుజాచార్యులు వారి శిష్యబృందంచే బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పంచామృతాభిషేకం అలంకరణ నివేదన అనంతరం స్వామి వారి యాగశాలలో ఉత్సవాలకు విశేష అలకరణలు చేసి వివిధ రకాల పూజలు, హోమాలు నిరహించి అనంతరం పూర్ణాహుతి శాత్తుమురై స్వామివారికి మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీచైర్మన్ కల్లూరు వెంకటస్వామి, వేదపారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, భక్తాదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ల పేరుతో ఉపాధికార్మికులకు తీవ్ర అన్యాయం



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కిచెన్ల పేరుతో ఉపాధి కార్మికులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని ఏఐటీయూసీ కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, నాయకుడు బాదుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. దినసరి కనీస వేతనం రూ.700 చెల్లించాలని డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం డీఈఓ కార్యాలయం ఎదుట స్మార్ట్ కిచెన్లను రద్దుచేసి, వంట ఏజెన్సీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈఓ డాక్టర్ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కామాక్షమ్మ, సులోచనమ్మ, మేరీ, పార్వతి,శారద,గురుదేవి తదితరులు పాల్గొన్నారు.

'తుఫానుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి'



ఏడీఏ లక్ష్మీమాధవికి వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుఫానుతో మండల వ్యాప్తంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు .ఈ మేరకు బుధవారం చెన్నూరుకు వచ్చిన ఏడీఏ లక్ష్మీమాధవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొంథా తుపాను ప్రభావం వల్ల, మినుము , వరి సాగు చేసిన రైతులు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారన్నారు. అలాగే ధాన్యం తడిచి మొలకెత్తడం, కొన్ని చోట్ల నీటిలో మునిగి ఉండడం జరిగిందన్నారు. రైతులు నష్టపోకుండా తడిచిన , మొలకెత్తిన ధాన్యంప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. కొండపేట సర్పంచ్ తుంగ చంద్రయాదవ్, మాజీ సర్పంచ్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, ముదిరెడ్డి దిలీప్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, అష్రత్, ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి సీపీఐ ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న గాలిచంద్ర

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించి, కార్పొరేట్ సంస్థల సేవలో మునిగి తేలుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ తెగనమ్ముతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐనగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కడప నగర సమగ్రాభివృద్ధి కోసం నీతివంతమైన నగర పాలక పాలన కోసం సీపీఐ ఉద్యమాలను ఉధృతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సహాయ కార్యదర్శి ఉద్దె మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపురానికి రాష్ట్రస్థాయి అవార్డు రావాలి

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



కమలాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో కమలాపురం మండలం రాష్ట్రస్థాయిలో అవార్డు వచ్చే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేపుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సభా భవనంలో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన, ఎంపీడీవో కెజియా ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అంతకు ముందు మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామంలో రైతులకు 50శాతం రాయితీతో అందించే పశు దాణాను పాడిరైతులకు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవ ర్గంలో దాదాపు 25 లక్షల రూపాయలు సబ్సిడీ రూపంలో దాణా పంపిణీ చేశామని అన్నారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని అధికారులు అందరూ కూడా రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి వారికి పని చేయాలన్నారు. కమలాపురం మండలం స్వచ్ఛత సేవలో రాష్ట్రస్థాయిలో అవార్డు పొందాలనే విధంగా ప్రతి అధికారి పనిచేయాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, ఉప ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి భరోసా రైతన్నా.. మీకోసం



మాట్లాడుతున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తోందని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎర్రబల్లె-2, ఇ.కొత్తపల్లె గ్రామాల రైతు సేవా కేంద్రాలలో జిల్లా రీసోర్స్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌రెడ్డితో కలిసి ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షించారు. అనంతరం ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖల అధికారులు ప్రత్యక్షంగా రైతాంగాన్ని కలిసి రైతులు పండించే విధానాలను అమలు చేస్తున్న వ్యవసాయ పద్ధతులను గమనించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో రైతాంగానికి అవసరమైన వివిధ రకాల అవసరాలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో చెన్నారెడ్డి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది శ్రీలత, ఇంతియాజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల దోపిడీ అరికట్టాలి

ఆర్జేడీ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల నిరసన



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫీజుల పేరుతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు దోపిడీని అరికట్టాలని విద్యార్థి యువజన సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఆర్జేడీ కార్యాలయం ఎదుట విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ నిబంధనల ప్రకారం రూ.125 వసూలు చేయాల్సిఉన్నా, కొన్ని కార్పొరేట్ పాఠశాలలో రూ.1000-రూ.1500 రసీదులు లేకుండా వసూలు చేస్తున్నట్లు ఆధారాలతో ఫిర్యాదులు చేసినా ఏ సంస్థపై విచారణ జరగలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేస్‌యాదవ్, పీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొడవటిగంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, ప్రణాళికతోనే ఉన్నతస్థాయికి చేరుకోగలం

లింగాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):క్రమశిక్షణ, ప్రణాళికతోనే ఉన్నతస్థాయికి చేరుకోగలమని ఎస్‌ఐ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని కోమన్నూతల ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, విశ్వనాథ్‌రెడ్డి, రామకృష్ణయ్య , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను విస్తరింపజేయాలి

పులివెందుల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను విస్తరింపజేయాలే కానీ నష్టం కలిగించే విధంగా ప్రైవేటీకరణ చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, పులివెందుల ఇన్‌చార్జి మనోహర్ పేర్కొన్నారు. బుధవారం పులివెందులలో పులివెందుల నాయకులు గఫూర్, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐఎన్ సుబ్బమ్మలతో కలిసి ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ కూటమి ప్రభుత్వం ఇంటి స్థలాలను, ఇళ్లను,రేషన్ కార్డులను,పింఛన్లను మంజూరు చేయాలని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి కోరారు. బుధవారం ఆర్‌సీపీ కార్యాలయం నందు నగరంలోని స్థానిక సమస్యలపై పేదలందరికీ ఇంటింటికీ స్థలాలు ఇవ్వాలంటూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్దిరామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు, డీజీహెచ్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలను ముంచిన ప్రభుత్వం : తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదనిరైతన్నలను నిండా ముంచిన ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందన్నారు. అరటి, చీనీ, నిమ్మ, మామిడి, మిర్చి, పొగాకు, టమోటా,ఉల్లి, పువ్వులు ఇలా రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించు చంద్రన్నా అని రైతులు మొత్తుకుంటుంటే, పంచ సూత్రాలు బోధిస్తానని చెప్పడం హాస్యాస్పమని ఎద్దేవా చేశారు.

అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవాలి

వేంపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలో అనధికారికంగా నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలని కడపఅర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కృష్ణసింగ్ తెలిపారు. వేంపల్లెలో ఈఓ నాగభూషణంరెడ్డితో సమావేశం అయ్యారు. అనధికార నిర్మాణాలు, లేఅవుట్లపై చర్చించారు. జనవరి 23లోపు అనధికార కట్టడాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

స్వీట్లు, పండ్లు పంపిణీ




మాట్లాడుతున్న మానవత ప్రతినిధులు

వేంపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ పిల్లల అభ్యున్నతికి చర్యలు తీసుకోవడం మంచి పరిణామమని మానవత స్వచ్ఛంద సంస్థ శాశ్వత చైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు ఫిజియోథెరపీ యోగీశ్వరబాబు తెలిపారు. దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని భవిత కేంద్రంలోని పిల్లలకు బుధవారం స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీ యశోద, మానవత సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్

కడప క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు, ప్రజలకు మరింత చేరువ అవుతూ నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా బుధవారం వాహన తనిఖీలు నిర్వహించడం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి రహదారి భద్రతా నిబంధనల గురించి అవగాహన కల్పిస్తున్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఉత్తమ ప్రణాళికతో ఉజ్వల భవిష్యత్ : వీసీ



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి నిర్దష్టమైన లక్ష్యంతో ఉత్తమ ప్రణాళిక రూపొందించుకొని ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ పి.సరిత ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశంచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మాట్లాడారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌వి సుబ్బారెడ్డి, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములలో రైతన్నా మీకోసం

వేముల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వేములలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి పాల్గొన్న కార్యక్రమాన్ని మండల అధికారులు వీక్షించారు. స్థానిక వేములలోని కార్యాలయంలో లైవ్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ రామశివదీక్షిత్, ఏఓ ఓబులేసు, ఎంపీడీఓ కుమార రంగయ్య, పట్టుపరిశ్రమ అధికారి వెంకటరామరాజు, టీడీపీ మండల నాయకులు పేర్ల శేషారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

మహిళా భద్రతపై అవగాహన

కడప క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది బుధవారం మహిళా భద్రతపై పాఠశాలలు, కళాశాల ల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో మహిళల భద్రత, పోక్సో ప్రాముఖ్యత గురించి వివరిస్తూ బాలికలు ఎదుర్కొనే మానసిక,శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే మానసిక, శారీరక, సామాజిక నష్టాలపై ఉదాహరణలతో వివరించడం జరిగింది. సైబర్ మోసాలపై వివరించారు.

ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి ఏ లోకి మార్చాలి



మాట్లాడుతున్న దుడం రెడ్డిబాబు

కడప మారుతీనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న ముదిరాజ్ వర్గీయులను బీసీ-డీ నుంచి ఏ లోకి మార్చాలని ఆంధ్రప్రదేశ్ కొలి సమాజ్ ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బిల్టప్ సమీపంలో గల ఏపీ కొలి సమాజ్ ముదిరాజ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీసీ-లో ఉన్న ముదిరాజ్‌లను బీసీ- డీ లోకి మార్చడం వలన విద్యా, ఉద్యోగ, ఉపాధి, రంగాలలో చాలా వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, కిలా బాలకృష్ణ, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న జరిగే ఆందోళనను జయప్రదం చేయండి

పులివెందుల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. 12వ తేదీ కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళన కార్యక్రమానికి అంగన్వాడీలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఆర్.లక్ష్మీదేవి, సలీమా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. బుధవారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు.ఈ సమస్యలపై 21న మైదుకూరులో జిల్లా కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుల క్రికెట్, త్రోబాల్ ఎంపికలు



త్రోబాల్ ఆడుతున్న ఉపాధ్యాయులు

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధ్యాయుల కోసం ఆటల పోటీలను కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయుల కోసం క్రికెట్, ఉపాధ్యాయినుల కోసం త్రోబాల్ ఆటలను ఎంఈవో-1 గంగిరెడ్డి, ఎంఈవో-2 సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల స్థాయిలో కొండపేట జిల్లాపరిషత్ హైస్కూలు మెన్స్ విభాగంలో క్రికెట్, ఉమెన్స్‌విభాగంలో త్రోబాల్‌కు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు గణేశ్‌బాబు, రాజశేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులలో ఉచిత శిక్షణకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పులివెందుల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌసల్య యోజన (డీడీయు-జీకేవై) సీడాప్ సహకారంతో న్యాక్ రాష్ట్రంలోని గ్రామీణ నిరుద్యోగ యువత కు స్కిల్ కళాశాల ద్వారా వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సోలార్ పీవీ ఇన్‌స్టాలర్, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. డిసెంబరు 15లోపు ఆసక్తి గల అభ్యర్థులు పులివెందులలోని న్యాక్‌లో హాజరుకావాలన్నారు. ఈ కోర్సులో సుమారు 120రోజుల పాటు శిక్షణ ఉటుందని, ఉచిత వసతి, భోజనం కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు 99851 42155, 90005 17637 నెంబర్లను సంప్రదించాలని ఏడీ రాకేష్ కోరారు.

మహిళలకు భద్రత, కొత్తచట్టాలపై అవగాహన

చెన్నూరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉప్పరపల్లె, రామనపల్లె, రాచిన్నాయపల్లె, కనుపర్తి, కొండపేట గ్రామాల్లో సీఐ క్రిష్ణారెడ్డి మహిళలకు భద్రత, కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలు వాటిని అరికట్టేందుకు తీసుకువచ్చిన విధానం,వారికున్న చట్టాలు, ఆ చట్టాలకు సంబంధించి ఏఏ నెంబర్ల ద్వారా ఫోను చేస్తే వారికి రక్షణ కల్పిస్తుంది వంటి విషయాలు వివరించారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు వేధింపులకు గురైన చోట మహిళలు డయల్ 112, అలాగే 181 , 1098 నెంబర్లకు ఫోను చేసి సహాయం పొందవచ్చన్నారు.కార్యక్రమంలోఏఎస్‌ఐ శంకర్‌నాయక్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

అన్ని ఖాళీలలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ ఖాళీ పోస్టులో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని ఎస్టీయూ కడప జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ డాక్టర్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీచట్టం ద్వారాజూన్ నెలలో బదిలీలు నిర్వహించిన తర్వాత ఇప్పటికీ దాదాపు 179మందికి రిలీవర్లు లేని కారణంగా బదిలీ పొందినప్పటికీ అదే పాఠశాలలో కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణారెడ్డి, ఆర్థిక కార్యదర్శి సుబ్రహ్మణ్యం, చెన్నకేశవరెడ్డి,సుబ్బారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

వారికి ఓటు అడిగే ధైర్యం లేదు : ఎంపీ

పులివెందుల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో కూటమి నాయకులు ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే ధైర్యం లేదని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైసీపీ నియోజకవర్గ, మండల,గ్రామస్థాయి కమిటీల సన్నాహక సమావేశం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సతీష్‌రెడ్డి, తొండూరు ఇన్‌చార్జి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ చిన్నప్ప నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి

రైతులకు అవగాహన

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలపై శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని చెన్నమరాజుపల్లె, కామనూరు, కొర్రపాడు, రాజుపాళెంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులతో కలిసి సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, పశువైద్యులు ఇందిర, జ్యోతి, అనూషా, పాండురంగారెడ్డి, పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ముద్దనూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం 'రైతన్నా మీకోసం' కార్యక్రమం చేపట్టిందని ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి కొత్తపల్లె రైతు సేవా కేంద్రంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పాల్గొన్న శాస్త్రవేత్తలు శ్రీవల్లి, క్రిష్ణప్రియ, శిల్పకళ రైతులకు సాగు పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, సిబ్బంది సుచరిత, రైతులు కిరణ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిపాడు జడ్పీహైస్కూల్‌లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు ఓబులేసు, రామయ్యలు తెలిపారు. ఈ పాఠశాలలో ఖాళీగా ఉన్న బయాలజీ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ద్వారా ప్రభుత్వం భర్తీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ పోస్టుకు ఐదు నెలల కాల పరిమితితో నెలకు రూ.12,500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జమ్మలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయవాదులు స్రవంతి, మాధవి సూచించారు. బుధవారం జమ్మలమడుగులోని భవిత కేంద్రంలో జడ్జి ఎస్.భార్గవి ఆదేశాల మేరకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఏర్పాటు చేసిన సదస్సులో భవిత కేంద్రంలో మానసిక వికలాంగులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు, భవిత కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సదరం క్యాంపు నిర్వహణ

జమ్మలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం సదరం క్యాంపు నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన రోగులు, అర్జీదారులు హాజరయ్యారు. ఈ క్యాంపులో ఆర్థోపెడిక్ డాక్టర్ నారాయణరెడ్డి వచ్చిన వారిని పరీక్షించారు. వారి సర్టిఫికెట్లు పరిశీలించి సదరం క్యాంపులో మొత్తం 46 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

బుడ్డశనగ పంట పరిశీలన

ప్రొద్దుటూరురూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన బుడ్డశనగ పంటను జేడీఏ చంద్రానాయక్ పరిశీలించారు. సోమవారం ఆయన స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ అనిత, ఏవో వరహరికుమార్, సిబ్బందితో కలిసి పంట పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పలు విషయాలను చర్చించారు. చీడపీడల నివారణ కోసం వేప నూనె పిచికారీని చేపట్టాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మారాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరురూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో ఆర్గానిక్ ఎరువులు, పంట సాగు విధానంలో రైతులు తమ పాత దృక్పథాన్ని వీడి ఆర్గానిక్ ఎరువులు, కషాయాలు పిచికారీలు వాడడంతో పాటు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి లాభసాటి దిగుబడి పొందాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పరపల్లె గ్రామంలో రైతన్నా-మీకోసం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అధికారులను గ్రామ గ్రామానికి పంపించి వారిని చైతన్యవంతులను చేయడంతో పాటు ఎన్నో ప్రయోజనకరమైన కార్యక్రమాలను నిర్వహిస్తుందని చెప్పారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ పంట మార్పిడి విధానాన్ని రైతులు అలవాటు చేసుకోవాలని, తద్వారా ఈ పంటలను ఆశించే తెగుళ్లు, మరో పంటకు వ్యాపించవన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఏడీఏ అనిత, ఏవో వరహరికుమార్, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, గ్రామ ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే సీఎం లక్ష్యం

- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్


బ్రహ్మంసాగర్‌లో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం పాటుపడుతున్నారని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. బుధవారం బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో చేపపిల్లలను మత్స్యశాఖ అధికారులు డిప్యూటీ డైరెక్టరు నాగయ్య, ఫిష్ డెవలప్‌మెంటు ఆఫీసరు బాలరాజు ఆధ్వర్యంలో చేపలను బ్రహ్మంసాగర్‌లో విడిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని మత్స్యకారులు అభివృద్ధి చెందడానికి టీడీపీ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. రాబోవు రోజుల్లో సబ్సిడీ రూపంలో ద్విచక్ర వాహనాలు, చేపల వలలు, సైకిళ్లు తదితర పరికరాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రస్తుతం బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో 17 టీఎంసీలు పూర్తి స్థాయిలో నీళ్లు నిల్వ ఉంచామని, ఈ ఘటన సీఎంకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సాంబశివారెడ్డి, నారాయణ, శివాయాదవ్, ఏఈ నాగేశ్వర్‌యాదవ్‌తో పాటు టీడీపీ నేతలు, మత్స్యకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

మైదుకూరు: మైదుకూరు అభివృద్ధిలో భాగంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ శ్రీకారం చుట్టారు. స్థానిక ఎర్రచెరువులో జలహారతి ఇచ్చి మత్స్యకారులకు తోడ్పాటు అందించడానికి 2 లక్షల చేప పిల్లలను నీటిలోకి వదిలారు. అలాగే 19వ వార్డు శ్రీనగరంలో రూ.17 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ రంగస్వామి, ఏఈ నిరంజన్‌రెడ్డి, టీడీపీ నాయకులు దాసరి బాబు, ఏపీ రవీంద్ర, ఆకుల క్రిష్ణయ్య, ఆర్.శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చౌక ధర దుకాణం సీజ్

చాపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని ప్రభుత్వ చౌక ధర దుకాణాన్ని కడప విజిలెన్స్ సీడీపీవో అధికారిణి గీతావాణి, బాబూమోషష్‌లు బుధవారం తనిఖీ చేసినట్లు తహసీల్దారు రామాకుమారి పేర్కొన్నారు. డీలర్ పద్మావతి బియ్యం తక్కువగా స్టాక్‌లో చూపించడంతో అధికారులు సీజ్ చేశారన్నారు. ప్రొద్దుటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు శివప్రసాద్ కూడా చౌక దుకాణాన్ని తనిఖీ చేశారు.

రైతుల కోసం పనిచేయండి

కలసపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బద్వేల్ మార్కెట్ యార్డు నూతన పాలక వర్గం రైతుల కోసం పనిచేయాలని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రంతు సూచించారు. బుధవారం జరిగిన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులను అభినందించారు. ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు పట్టాభిరెడ్డి, యువ నాయకుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో దివ్యాంగులు రాణించాలి

బద్వేలుటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో దివ్యాంగులు రాణించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైకల్యం అనేది శరీరానికి మాత్రమేనని, సంకల్పానికి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా కల్యాణ్‌బాబు, పీఓలు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్సులో అక్షితసాయి ప్రతిభ



చాపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరహరిపురం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జ్ఞాన అక్షితసాయి మార్షల్ ఆర్ట్స్ జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ నరసింహశాస్త్రి పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ అండర్-17 విభాగంలో బాలికను అధికారులు ఎంపిక చేశారు. ఛత్తీస్‌గడ్‌లోని రాయపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆ బాలిక పాల్గొంటున్నట్లు ఆయన చెప్పారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపిక



దువ్వూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని జడ్పీ హైస్కూలుకు చెందిన వంశిక రాష్ట్రస్థాయిలో జరిగే కౌశల్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. 10వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వంశికను అభినందించారు.

రైతన్నకు ప్రభుత్వం వెన్ను.. దన్ను


రైతులతో మాట్లాడుతున్న మల్లెల లింగారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల శ్రేయస్సుకోసం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచి అన్నివిధాలుగా సహాయ సహకారాలను అందిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో రైతు సేవా కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమ ఆన్‌లైన్ ప్రసారాన్ని నిర్వహించి రైతుల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకురాలు సుమలత, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆదర్శం.. అంబేడ్కర్


రక్తదానం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శమని ఎస్‌టీవో తిరుపతిస్వామి, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అంబేడ్కర్ వర్ధంతి వారోత్సవాలు, సీఐటీయూ అఖిల భారత మహాసభలను పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. 35 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్ఐ హనుమంతు, డేవిడ్‌రాజు, సాల్మన్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలి


సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

ఎర్రగుంట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చిన ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎర్రగుంట్ల అర్బన్ పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై విచారించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నాగమురళి, ఏఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కొండ సుంకేసులలో ఘర్షణ

జమ్మలమడుగు/ పెద్దముడియం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో బుధవారం ఉదయం ఘర్షణ చోటుచేసుకుంది. దారి సమస్య కారణంగా ఈ గొడవ చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో మాబూసాహెబ్‌తో పాటు మరో ఇద్దరు తనపై దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు మదన్‌గోపాల్‌రెడ్డి జమ్మలమడుగు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్ఐ ఆంజనేయులు ఫిర్యాదును తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్

ప్రొద్దుటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలతో పాటు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలు గానీ గ్రామ వార్డు సమస్యలున్నా ఎమ్మెల్యేను నేరుగా కలవచ్చని తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పోరుమామిళ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే తయారుచేయబడిన పదోతరగతి స్టడీ మెటీరియల్‌ను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నయ్య జిల్లా సాంస్కృతిక కో కన్వీనరు ప్రసాద్, టేకూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ స్టడీ మెటీరియల్ చదవడం ద్వారా 80 శాతం వరకు ఫలితాలు సాధించవచ్చన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలగంగిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు గురయ్య, కరీముల్లా బాషా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం

రాజుపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల చెన్నకేశవ సంజీవరాయస్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మండపంపై సీతారామలక్ష్మణ సంజీవరాయస్వామి ఉత్సవ విగ్రహాలను కూర్చోబెట్టి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గంగిరెడ్డి లక్ష్మినారాయణరెడ్డి, ఆలయ ఈవో కేవీ రమణ పాల్గొన్నారు.

గండికోటను సందర్శించిన విద్యార్థినిలు: మండలంలోని వెల్లాల బాలయోగి గురుకుల పాఠశాలలోని విద్యార్థినిలు బుధవారం గండికోటను సందర్శించారు. విజ్ఞాన విహార యాత్రలో భాగంగా ఈ విద్యార్థినిలు అక్కడికి తీసుకెళ్లినట్లు ప్రిన్సిపల్ తులశమ్మ తెలిపారు. అక్కడ పూర్వపు కట్టడాలు, వివిధ రకాల ప్రదేశాలను విద్యార్థులు తిలకించినట్లు తెలిపారు.

పలు సెక్షన్లకు ఉద్యోగుల కేటాయింపు

ప్రొద్దుటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పలు సెక్షన్లలో ఖాళీగా వున్న సీట్లకు ఉద్యోగులను కేటాయిస్తూ మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయ ఉద్యోగుల రికార్డుల పరిశీలనకు సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఇంజనీరింగ్ సెక్షన్ ఈ1గా సీనియర్ అసిస్టెంట్ ఏఎస్ జాఫర్ హుస్సేన్, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ జీ1ఇన్‌చార్జ్‌గా జాఫర్ హుస్సేన్, పబ్లిక్ హెల్త్‌సెక్షన్ ఎఫ్1గా సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌రావు, ఎఫ్2గా సీనియర్ అసిస్టెంట్ మహేష్‌బాబు, చైర్‌పర్సన్ క్యాంప్ క్లర్క్‌గా జూనియర్ అసిస్టెంట్ విజయ్‌బాబు, కోర్టు కేసులు ఆర్‌టీఐ విభాగానికి జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ప్రధాన కార్యాలయం సి1గా సీనియర్ అసిస్టెంట్ సిబ్గతుల్లా, సి2గా జూనియర్ అసిస్టెంట్ శ్రీజను నియమించారు. వీరు ఆ సెక్షన్లలో బాధ్యతలు నిర్వహించాల్సి వుంటుంది.

యూడీఆర్ఐకి నాలుగు సీట్లు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఒకే ఉద్యోగికి నాలుగు ప్రధాన సీట్లు కమిషనర్ కేటాయించడంపై చర్చ జరుగుతోంది. మున్సిపల్ యూడీఆర్ఐగా వున్న సీనియర్ అసిస్టెంట్ మేకల రమేష్‌బాబుకు మున్సిపాలిటీలో కీలకమైన రెవిన్యూ సెక్షన్ (ఆర్ఐ)తో పాటు ఆ సెక్షన్ హెడ్ రెవిన్యూ ఆఫీసర్ (ఆర్‌వో) జోసఫ్ బదిలీపై కమిషనర్‌గా వెళ్లడంతో ఆర్‌వో ఇన్‌చార్జ్‌గా కూడా ఇచ్చారు. అలాగే రెవిన్యూ సెక్షన్‌కు వున్న ఏ1 గుమస్తా సీటు, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఇన్‌చార్జ్ కూడా ఆయనకే ఇవ్వడంపై ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. ఇన్ని సీట్లకు ఈ ఉద్యోగి న్యాయం చేయగలరా అనేది ప్రశ్నార్థకంగా వుంది.

వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం


చెక్కు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ రితీశ్‌రెడ్డి

పోరుమామిళ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పంచసూత్రాలు ప్రవేశపెట్టిందని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్‌కుమార్‌రెడ్డి, కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటక్రిష్ణారెడ్డి, సర్పంచ్ రఘునాథరెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పుల్లీడు రైతుసేవా కేంద్రంలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళామార్ట్‌ను సద్వినియోగం చేసుకోండి

డ్వాక్రా మహిళలు మహిళా మార్ట్‌ను సద్వినియోగం చేసుకుని లాభాల బాటలో నడవాలని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డి అన్నారు. బుధవారం పోరుమామిళ్ల వెలుగు కార్యాలయంలో వెలుగు మహిళా మార్ట్ వాటాదారుల లాభాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 1095 స్వయం సహాయక గ్రూపులకు 10959 మంది సభ్యులకు రూ.7,45,172 చెక్కు అందించారు. కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

- అట్టహాసంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిటీమెంబర్లు, విజయమ్మను సన్మానించిన నాగరాజు, ఆర్యవైశ్యులు

బద్వేలుటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బద్వేలు వ్యవసాయ మార్కెట్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకార మహోత్సవం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఆర్ కన్వెన్షన్ మండపంలో బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ సుబ్బరాయుడు, కూటమి నేతల సమక్షంలో వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా నారిశెట్టి సుప్రజ, వైస్ చైర్మన్‌లుగా బసిరెడ్డి రవీంద్రారెడ్డి, మార్కెట్‌యార్డు కమిటీ డైరెక్టర్ చంద్రకళావతి, కాసా రాజమ్మ, మరో 13 మంది ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, డబుల్ ఇంజన్‌సర్కార్‌తో ముందుకు పోతోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా రోశన్న, ఏపీఐసీసీ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, జనసేన జిల్లా నాయకుడు శ్రీనివాస్, ఏపీఆర్‌టీసీ డైరెక్టర్ రంతు, బొమ్మన విజయ్, రాగిమాను ప్రతాప్‌కుమార్, హరిప్రసాద్, కొలవలి వేణుగోపాల్, వెంగల్‌రెడ్డి, రైస్‌మిల్లు ప్రసాద్, కాసా వెంకటసుబ్బారెడ్డి, కేవీ సుబ్బారావు, ఏవీ రమణారెడ్డి, యనమల సుధాకర్, ఇమామ్ హుస్సేన్, నారిశెట్టి నాగేంద్ర, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

విజయమ్మను సన్మానించిన ఆర్యవైశ్యులు

వ్యవసాయ మార్కెట్‌యార్డు డైరెక్టర్ ప్రమాణస్వీకారం చేసిన కొలిశెట్టి నాగరాజు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డిలను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కనుమర్లపూటి ప్రసాద్, కేవీ సుబ్బారావు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.